క్లుప్తంగా

సంయుక్త సంచాలకుడితో ఏఎంసీ చైర్మన్ భేటీ



నిజాంసాగర్(జుక్కల్): వ్యవసాయ మార్కెట్ సంయుక్త సంచాలకులు మల్లేశంను మంగళవారం పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ పటేల్ కలిశారు. పిట్లం మార్కెట్ కమిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులు మంజూరు చేయాలని కోరినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ తెలిపారు. ఉప సంచాలుకులు శ్రీ ప్రసాద్‌ను సైతం మర్యదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు.

రెడ్డి రాజయ్య దంపతులకు నగదు పురస్కారం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సోమవారం తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో సారిపల్లి ఫౌండేషన్ తరపున జానపద కళలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కుప్రియాల్‌కు చెందిన కళాకారుడు రెడ్డి రాజయ్య దంపతులకు నగదు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ సలహాదారు రమణాచారి, పురస్కార దాత కొండల్ రావు, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ గద్దర్ వెన్నెలమ్మ, సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య, జానపద కళాకారుల సంఘం ప్రతినిధులు వంగ శ్రీనివాస్ గౌడ్, లింగన్న పాల్గొన్నారు.

జానపద కళాకారుడికి సన్మానం



లింగంపేట(ఎల్లారెడ్డి): తెలంగాణ జానపద కళాకారుల సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉప్పల విశ్వనాథం దంపతులను సోమవారం రాత్రి హైదరాబాదులోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో ఘనంగా సన్మానించారు. జానపద కళారంగంలో చురుకుగా పాల్గొంటూ తోటి కళాకారులను ప్రోత్సహించి అండగా నిలిచి ప్రదర్శనలు ఇచ్చిన లింగంపేట మండల కేంద్రానికి చెందిన ఉప్పల విశ్వనాథం దంపతులను శాలువా, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజన్న, జిల్లా కార్యదర్శి ఆనంద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ



ఎల్లారెడ్డిరూరల్: మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలను మంగళవారం జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్, ఆర్‌ఎల్‌సీ కిరణ్‌గౌడ్‌తో కలిసి తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. సవరించిన మెను ప్రకారం ప్రతిరోజు భోజనం, స్నాక్స్, పండ్లు అందించాలని సూచించారు. విద్యార్థులు ఉపాధ్యాయులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఇటీవల నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో ప్రతిభ చాటి బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపల్ మహమ్మద్ రఫత్, ఎస్ఎల్‌సీ బాలరాజ్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికుడు పాసుల రేవన్ ప్రమాదంలో మృతి చెందగా ఆయన అంత్యక్రియలకు మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10 వేలను అందించారు. కార్మికుడి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బంగా నిర్వహించాలని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. కార్యదర్శి బాలు, టెక్నికల్ అసిస్టెంటు కృష్ణాగౌడ్, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నేళ్లకు ఇళ్లు పూర్తయ్యేనో..?

- ఏడేళ్ల క్రితం డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం ప్రారంభం
- బేస్‌మెంట్ దశలోనే ఆగిన నిర్మాణాలు
- పట్టించుకోని పాలకులు



గాంధారిలో బేస్‌మెంట్ దశలోనే ఆగిపోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఇళ్లులేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టివ్వాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొన్ని గ్రామాల్లో ఇళ్లు నిర్మించి ఇచ్చింది. గాంధారిలో కూడా పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని 2015–16లో మొదటి విడతలో 50 ఇళ్లు నిర్మించాలని రూ.2.62 కోట్లు మంజూరు చేసింది. 2017లో గిరిజన బాలుర గురుకుల పాఠశాల పక్కన మూడెకరాల స్థలం సేకరించి అప్పటి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి చేతుల మీదుగా భూమిపూజ చేశారు. ముంబయికి చెందిన డ్రీమ్ ఇండియా కంపెనీ కాంట్రాక్ట్ తీసుకుని నిర్మాణ పనులు ప్రారంభించింది. బేస్‌మెంట్ వరకు నిర్మించి అర్ధంతరంగా పనులు నిలిపివేశారు. ఏడేళ్ల నుంచి పట్టించుకున్న వారే లేరు. బీఆర్ఎస్ ప్రభుత్వం మారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే. మదన్‌మోహన్ రావు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల మేరకు నిరుపేదలు ఆయనపై ఆశలు పెట్టుకున్నారు. కానీ ఎమ్మెల్యే మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మాట ఎత్తడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇంటింటి సర్వే చేస్తున్నారు. సర్వేలో ఇంటి స్థలం లేని వారితో పాటు పునాది దాటని ఇళ్ల నిర్మాణాలు కూడా పూర్తి చేసి ఇవ్వాలని నిరుపేదలు కోరుతున్నారు.

ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయం



డీఈవో రాజుకు వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: పక్షం రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని చేపడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె మంగళవారం 15వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం సమ్మె శిబిరం నుంచి ఉద్యోగులు భారీ బైక్ ర్యాలీ ప్రారంభించారు. అక్కడి నుంచి పట్టణంలో ప్రధాన వీధుల గుండా కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లారు. డీఈవో ఎస్.రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. ఈనెల 30న నిర్వహించే కేబినెట్ సమావేశంలో తమ సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. సీఎం ఇచ్చిన క్రమబద్ధీకరణ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈనెల 27 నుంచి కేజీబీవీ టీచింగ్, నాన్‌టీచింగ్ టీచర్లు సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షులు వాసంతి, నాయకులు శ్రీధర్, రాములు, సంతోష్ రెడ్డి, శైలజ, రమేష్, సాయిలు, వనజ, వీణ, లావణ్య, శ్రీను తదితరులున్నారు.

దారి ఇవ్వని వానర సేన



బాన్సువాడ రూరల్: మండలంలోని కొత్తాబాది గ్రామ ప్రభుత్వ పాఠశాల వద్ద నిత్యం పదుల సంఖ్యలో వానరాల(కోతుల)మంద తిష్టవేస్తోంది. దీంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. గుంపులు గుంపులుగా ఉంటున్న వానరాల మందను దాటాలంటే అవి వెళ్లే వరకు వేచిచూడాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. వనాలను వదిలి గ్రామాల్లో తిష్టవేసిన వానరాలను తిరిగి వనం బాట పట్టించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి

బాన్సువాడ: ఇంటర్‌లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా నోడల్ అధికారి సలాం అన్నారు. మంగళవారం బీర్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. 90 రోజుల ప్రణాళికపై విద్యార్థులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇంటర్ విద్యనే కీలకమని, ప్రతి విద్యార్థి వచ్చే మూడు నెలలు కష్టపడి చదవాలన్నారు. పోటీ ప్రపంచంలో నూటికి నూరు శాతం మార్కులు సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. ప్రిన్సిపల్ మోహన్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పర్మిట్‌రూం కాదు.. ప్రయాణ ప్రాంగణమే !



మందు సీసాలు, బీర్ బాటిళ్లతో నిండిన అంకోల్ తండా బస్టాండ్

నస్రుల్లాబాద్(బాన్సువాడ): పైన కనపడుతున్న చిత్రంలో మందు బాటిళ్లు, మద్యం సీసాలు చూసి పర్మిట్ రూం అనుకుంటే పప్పులో కాలు వేసినట్లే. ఇది నస్రుల్లాబాద్ మండలంలో అంకోల్ తండా గ్రామ ప్రయాణ ప్రాంగణం. ప్రస్తుతం ఇది మందు బాబులకు అడ్డాగా మారింది. రాత్రి పగలు తేడా లేకుండా ఇష్టారీతిన బస్టాండ్‌లో బహిరంగంగా మద్యం తాగుతున్నారు. ప్రయాణికులు కాస్త కూర్చుందాం అంటే వీలు లేకుండా సీసాలు పడి ఉంటున్నాయి. గ్రామాల్లో విచ్చల విడిగా బెల్టు షాపులు కొనసాగడంతో ఇలా బహిరంగంగా మద్యం తాగుతున్నారని ప్రజలు వాపోతున్నారు. బెల్టు షాపులను అరికట్టాల్సిన అధికారులు మామూళ్లకు అలవాటు పడి కనీసం తనిఖీలు కూడా చేయకుండా వదిలేస్తున్నారు. నస్రుల్లాబాద్ మండలం మహారాష్ట్రకు దగ్గరగా ఉండటంతో అక్కడ తక్కువ ధరకు తీసుకువచ్చి ఇక్కడ అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అధికారులు తమ విధులు సక్రమంగా నిర్వర్తిస్తే అవాంఛనీయ ఘటనలకు తావు ఇవ్వకుండా అరికట్టవచ్చని ప్రజలు అంటున్నారు.

'విద్యారంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయించాలి'



ప్రమాణస్వీకారం చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యవర్గం

కామారెడ్డి అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు 15 శాతం బడ్జెట్ కేటాయింపులు చేసి పూర్వవైభవం తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం ఫెడరేషన్ జిల్లా ఐదో మహాసభలు స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన భాగ్యరెడ్డి వర్మ ప్రాంగణంలో నిర్వహించారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని రెండేళ్ల కాలానికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యా కమిషన్‌కు మేధావులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తగిన సలహాలు, సూచనలు అందించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి డి.సత్యానంద్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు రమేష్, జిల్లా అధ్యక్షుడు ఆకుల బాబు, కార్యదర్శి సాయిలు తదితరులు మాట్లాడారు.

జిల్లా కార్యవర్గం..

ఫెడరేషన్ జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఆకుల బాబు, ప్రధాన కార్యదర్శిగా ఎ. సాయిలు, ఉపాధ్యక్షులుగా బి. వెంకట్‌రెడ్డి, ఏమిలియా, కోశాధికారిగా ఎన్వీ రూప్‌సింగ్, రాష్ట్ర కన్వీనర్‌గా కె.రాజవర్ధన్, జిల్లా కార్యదర్శులుగా ఎం.గోపాల్, వై.గోపాల్, ఎస్.నారాయణ, ఎస్.బాలయ్య, సాయిగౌతమ్, ఎ.దయాకర్, బి.నాంపల్లి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా టి.సుధాకర్, వి.బసవయ్య, కార్యవర్గ సభ్యులుగా జె.గణపతి, ఎం.గోపాల్ ఎన్నికయ్యారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్



బాన్సువాడ: పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్ అని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాన్సువాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు అనారోగ్యానికి గురైనప్పుడు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు.

సమాచారం..

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ మంగళవారం తెలిపారు. మద్నూర్ డిగ్రీ కళాశాలలో తెలుగు, ఆంగ్లం, బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీ సబ్జెక్టులు బోధించడానికి సబ్జెక్టుకు ఒక ఖాళీ ఉందని, సంబంధిత సబ్జెక్టు పీజీలో 55 శాతం మార్కులు వచ్చి ఉండాలని ఆయన సూచించారు. నెట్, సెట్, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. విద్యార్హత పత్రాలు ఈ నెల 27న మధ్యాహ్నం 3 గంటల లోపు బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందించాలని ఆయన పేర్కొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చీల ముస్తాబు



పోచారంలో ముస్తాబైన చర్చి

కిస్మస్ వేడుకలకు జిల్లాలోని చర్చిలు అందంగా ముస్తాబయ్యాయి. చర్చిలకు కొత్తగా రంగులు వేయించారు. రంగురంగుల విద్యుత్ బల్బులను ఏర్పాటు చేశారు. బుధవారం చర్చిలలో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేశారు. – సాక్షి నెట్‌వర్క్

అమిత్ షాకు కేంద్ర మంత్రిగా ఉండే అర్హత లేదు

- వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బాన్సువాడలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ : బీజేపీ నేత అమిత్ షాకు కేంద్ర మంత్రిగా ఉండే అర్హత లేదని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాన్సువాడ అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిందని, సంక్రాంతి తర్వాత రైతులకు రైతు భరోసా ఇస్తుందని అన్నారు. వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్, కాంగ్రెస్ నాయకులు నార్ల రవీందర్, నార్ల సురేష్, జంగం గంగాధర్, శ్యామల, పవన్, ఖలేక్, అలిఅబిన్‌అబ్దుల్లా, మోహన్‌నాయక్, నర్సింలు, ప్రశాంత్, ఎజాస్, ఉద్దెర హన్మండ్లు, కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, తదితరులున్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న సుజాత

కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు సుజాత సూర్యవంశీ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ముందు దివ్యాంగులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇస్తామన్న చేయూత పింఛన్‌ను తక్షణమే అమలు చేయాలన్నారు. గ్రామ స్థాయి నుంచి చట్టసభలకు వరకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఇందిరమ్మ గృహాలను ప్రతీ ఒక్క దివ్యాంగుడికి మంజూరు చేయాలని, అంత్యోదయ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భక్తి శ్రద్ధలతో పండుగను జరుపుకోవాలి

- ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు



ఎల్లారెడ్డిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే



ఎల్లారెడ్డిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు

ఎల్లారెడ్డి రూరల్ : క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో క్రిస్మస్ పండుగను జరుపుకోవాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం క్రైస్తవుల అభివృద్ధికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నదని అన్నారు. త్వరలోనే ఎల్లారెడ్డిలో డబుల్ బెడ్రూంల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. ఆర్డీవో ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

అమిత్ షా క్షమాపణలు చెప్పాలి

ఎల్లారెడ్డి రూరల్ : కేంద్ర మంత్రి అమిత్ షా, అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు డిమాండ్ చేశారు. మంగళవారం ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నాగిరెడ్డిపేట/తాడ్వాయి(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట, తాడ్వాయి మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మంగళవారం ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బెజుగంచెర్వుతండాకు చెందిన సొసైటీ డైరెక్టర్ కిషన్‌నాయక్, పోచారం గ్రామ మాజీ సర్పంచ్ నర్సాగౌడ్, లింగంపల్లికలాన్ మాజీ సర్పంచ్ కిష్టయ్య, ఏఎంసీ మాజీ డైరెక్టర్ నారాగౌడ్, తాడ్వాయి మండలం కరడ్‌పల్లికి చెందిన మాజీ జెడ్పీటీసీ సుంకరి గంగాధర్‌తో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీజేపీ బలోపేతానికే బూత్ కమిటీల ఏర్పాటు



ముత్యంపేటలో బీజేపీ బూత్ కమిటీ సభ్యులతో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి

దోమకొండ: పార్టీ బలోపేతానికే గ్రామాల్లో బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం చింతమాన్‌పల్లి, ముత్యంపేట గ్రామాల్లో బూత్ కమిటీలను ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. చింతమాన్‌పల్లి 87వ బూత్ అధ్యక్షుడిగా జంగంపల్లి స్వామి, 88వ బూత్ అధ్యక్షుడిగా సార్ల శేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ముత్యంపేట్ గ్రామ కార్యకర్తల సమావేశం నిర్వహించి 89వ బూత్ అధ్యక్షుడిగా దేవరాజు, 90వ బూత్ అధ్యక్షుడిగా తిరుపతి రెడ్డి, 91వ బూత్ అధ్యక్షుడిగా బండారి బాల్‌రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నందివేణు, బీజేపీ జిల్లా కార్యదర్శి సంతోష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేటలో..



నాగిరెడ్డిపేటలో నియామక పత్రాలను అందజేస్తున్న రాష్ట్ర నేత బాణాల లక్ష్మారెడ్డి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన బూత్ కమిటీలను మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బాణాల లక్ష్మారెడ్డి ఏర్పాటు చేశారు. పార్టీ బలోపేతానికి బూత్‌కమిటీ సభ్యులు కృషి చేయాలని ఆయన సూచించారు. మండలంలోని 32 బూత్‌లకు కమిటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

ఉప్పర్‌పల్లి, మాందాపూర్ గ్రామాల్లో..



ఉప్పర్‌పల్లిలో నూతనంగా ఎన్నికైన అధ్యక్షులతో బీజేపీ నాయకులు

బీబీపేట: మండలంలోని ఉప్పర్‌పల్లి, మాందాపూర్ గ్రామాల్లో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఉప్పర్‌పల్లి 68వ బూత్ అధ్యక్షుడిగా దోనేటి శేఖర్, 69వ బూత్ అధ్యక్షుడిగా బాల్‌నర్సు, మాందాపూర్ గ్రామంలోని 81వ బూత్ అధ్యక్షుడిగా చెన్నం మల్లారెడ్డి, 82వ బూత్ అధ్యక్షుడిగా చింతకుంట లింగారెడ్డి, 83వ బూత్ అధ్యక్షుడిగా శీలం శేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షుడు రంజిత్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): చిట్యాల గ్రామంలో మంగళవారం నూతనంగా బూత్ కమిటీలను ఎన్నుకున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్ రెడ్డి తెలిపారు. మూడు బూత్ కమిటీల అధ్యక్షులుగా సతీష్, రాజు, బాపురావులను ఎన్నుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, నాయకులు రమేష్, రాజిరెడ్డి, సిద్దిరాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మంగళవారం కళాజాత బృందం సభ్యులు అవగాహన కల్పించారు. ఉచిత బస్సు, రాయితీపై గ్యాస్, గృహలక్ష్మి తదితర పథకాలపై పాటల రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాజాత బృందం ప్రతినిధులు రమేశ్ రావు, సవిత, శిల్ప, లత, దివ్య, ప్రశాంత్ రెడ్డి, మహేందర్, విఠల్ రెడ్డి, తిరుపతి, కాశీరాం, తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా దిష్టిబొమ్మ దహనం



పెద్దకొడప్‌గల్‌లో అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): కేంద్ర హోంమంత్రి అమిత్ షా, అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో జుక్కల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్ సొదాగర్ అరవింద్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. యువ నాయకులతో ధర్నా చేపట్టారు. అనంతరం అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశా రు. నిజాంసాగర్ మండల ఎస్సీ సెల్ చైర్మన్ సంగమేశ్వర్, కాస్లాబాద్ గ్రామ అధ్యక్షుడు హన్మాండ్లు, నేతలు ఖండేరావ్, విఠల్ పాల్గొన్నారు.

అయ్యప్ప పడి పూజ మహోత్సవం



బాన్సువాడ : వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్వగృహంలో మంగళవారం అయ్యప్ప పడి పూజ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితులు జపాల చంద్రశేఖర్‌శర్మ, పురుషోత్తం రావుల ఆధ్వర్యంలో అయ్యప్ప పూజ జరిపించారు. నియోజకవర్గానికి చెందిన అయ్యప్ప మాలధారణ స్వాములకు భిక్ష పెట్టారు. గురుస్వాములకు సన్మానం చేశారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, ఆయన కుమార్తె దంపతులు, పోచారం శంభూరెడ్డి దంపతులు అయ్యప్ప పడిలో పాల్గొన్నారు.